

భువనగిరి ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, పక్కన భువనగిరి అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, వేదికపై మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, షీప్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మధుసూదనాచారి, ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, చకిలం అనిల్‌కుమార్



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

# బీఆర్ఎస్ వెంటే భువనగిరి

- సీఎం కేసీఆర్ సభ గ్రాండ్ సక్సెస్
- బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన సభ
- ఆకట్టుకున్న బీఆర్ఎస్ అధినేత ప్రసంగం
- జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో దద్దరిల్లిన గ్రౌండ్

## ప్రజా ఆశీర్వాద సభకు పోటెత్తిన జనం

ఆకాశాన్నంటే అభిమానం.. ఉరకలెత్తే ఉత్సాహం. మెడలో గులాబీ కండువా.. మది నిండా అభిమానం.. వాహనాల్లో మార్మోగిన తెలంగాణ పాటలు.. వెరసి భువనగిరిలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. సభ సక్సెస్‌తో గులాబీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ముఖ్యమంత్రి కేసీఆర్ తనదైన శైలిలో కాంగ్రెస్‌ను తూర్పారబట్టారు. సభ ఆసాంతం జై తెలంగాణ, జై కేసీఆర్, జై పైళ్ల శేఖర్‌రెడ్డి నినాదాలతో హోరెత్తింది. బీఆర్ఎస్ శ్రేణుల ఈలలు, కేరింతలతో సభ దద్దరిల్లిపోయింది.

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ)





సీఎం సభకు తరలి వస్తున్న మహిళలు



సభ బయట ఎల్ఈడీ స్క్రీన్‌లో సీఎం ప్రసంగాన్ని వింటున్న జనం



సభలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



సీఎం కేసీఆర్ ప్రసంగానికి చప్పట్లు, నినాదాలతో మద్దతు తెలుపుతున్న సభికులు



సీఎం సభలో మహిళల ఉత్సాహం





సీఎం సభకు డప్పుచప్పుళ్లతో ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు



### సభకు సకల ఏర్పాట్లు..

సభకు వచ్చిన ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా బీఆర్ఎస్ పార్టీ అన్ని ఏర్పాట్లు చేసింది. మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచింది. వేల సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ఎక్కడికక్కడ పార్కింగ్ పాయింట్లను ఏర్పాటు చేసింది. దూరంగా ఉన్న సభికులకు వేదిక కనిపించేలా ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. వేదికపై నియోజకవర్గ ముఖ్య నేతలు ఆసీనులయ్యే అవకాశం కల్పించారు. మహిళలు, వీఐపీలు, మీడియా, వృద్ధుల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్ సభకు 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. బహిరంగ సభకు తరలివచ్చిన జనాలను పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేసి లోపలికి అనుమతించారు. సీపీ డీఎస్ చౌహాన్, డీసీపీ రాజేశ్‌చంద్ర ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. పట్టణంలో ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకున్నారు.



ప్రజా ఆశీర్వాద సభలో జై కేసీఆర్ నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

### ఫలించిన ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి కృషి

- సభ సక్సెస్ కోసం అన్నీ తానై వ్యవహరించిన పైళ్ల

భువనగిరిలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ సక్సెస్ కావడంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కృషి ఫలించింది. వారం రోజులుగా ఎమ్మెల్యే ఇక్కడే తిష్టవేసి సభ సక్సెస్ చేసేందుకు తనవంతు పాత్ర పోషించారు. సభ తేదీ ప్రకటించిన నాటి నుంచే స్థానికులతో కలిసి ఏర్పాట్లలో అన్నీ తామై పర్యవేక్షించారు. సభా స్థలం ఎంపిక నుంచి ఏర్పాట్లు, జన సమీకరణ అన్నింటిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వారం రోజులుగా సభ నిర్వహణ కోసం అలుపెరుగకుండా శ్రమించారు. రోజూ ఉదయం, సాయంత్రం సభాస్థలికి వెళ్లి దగ్గరుండి పరిస్థితులను సమీక్షించారు. జన సమీకరణ కోసం ముందుగానే సన్నాహక సమావేశాలు నిర్వహించారు. మండలాలు, గ్రామాల వారీగా ఇన్‌చార్జిలను నియమించారు. సభలో అసౌకర్యం కలుగకుండా చూసుకోవడంతో పాటు పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు.

### ఆకట్టుకున్న సీఎం కేసీఆర్ ప్రసంగం

ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రజలను ఆకట్టుకుంది. కాంగ్రెస్ నిర్వాకాన్ని వివరించారు. హస్తం పార్టీకి అవకాశం ఇస్తే జరిగే నష్టాన్ని విశదీకరించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను తెలియజేశారు. గులాబీ అధినేత ప్రసంగం రైతులు, ప్రజలను ఆలోచింపజేసింది. 24గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలో.. మూడు గంటల కాంగ్రెస్ కావాలో ఆలోచించాలన్నారు. మూడు గంటల కరెంట్‌కు గట్టి షాక్ ఇవ్వాలని పిలుపునిచ్చారు.

### ఆకట్టుకున్న ఆటాపాట, సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజా ఆశీర్వాద సభలో సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. సభకు మహిళలు బతుకమ్మలు, కోలాటాల ప్రదర్శనలతో తరలివచ్చారు. వృత్తిదారులు తమ ఆచార, సంప్రదాయాలతో కూడిన వృత్తిపరమైన పనిముట్లతో వచ్చి ఆకట్టుకున్నారు. భుజాన గొంగడి, సంకన గొర్రెపిల్లతో గొల్లకురుమలు.. వలలతో ముదిరాజ్‌లు.. కల్లు కుండలతో గీత కార్మికులు తరలివచ్చారు. ఒగ్గుడోలు, కొమ్ము డోలు కళాకారులు సంప్రదాయ పద్ధతిలో మెప్పించారు. గిరిజనులు తమ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. సభలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ధూంధాం పాటలు సభికులను ఉర్రూతలూగించాయి. సింగర్ మధుప్రియ బృందం ఆటపాటలకు అంతా ముగ్ధులయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలపై కళాకారులు పాటలు పాడుతూ అలరింపజేశారు.



సభా వేదికపై కళాకారుల ఆటాపాట



సభా వేదిక వద్ద మహిళల కోలాటం